సాక్షి మంచిర్యాల

శుక్రవారం | 19 | జూలై | 2024



సరిహద్దున హై అలర్ట్

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌తో ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ప్రజాప్రతినిధులను అప్రమత్తం చేశారు. 8లో▸



నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లో..

అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతులతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతుండడంతో సౌకర్యాలు కరువయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. పిడుగులు పడవచ్చు. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

మొదటి విడతలో రూ.154 కోట్లు మాఫీ

మంచిర్యాలఅగ్రికల్చర్: రుణమాఫీ పథకంలో భాగంగా జిల్లాలోని అర్హులైన రైతులకు రూ.లక్షలోపు రుణం గురువారం మాఫీ అయింది. ఈ మేరకు ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయింది. రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులు 27,827మందికి రూ.154,39,496 ఖాతాల్లో జమ అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 17రైతువేదికల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, వ్యవసాయ శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షం



భీమారంలో జాతీయరహదారిపై వరద నీరు

జైపూర్/భీమారం: జిల్లాలోని జైపూర్, భీమారం మండలాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. జైపూర్ మండలంలోని జైపూర్, రసూల్‌పల్లి, ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గ్రామాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కుండ పోత వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 66మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. భీమారం మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారి వాగులా మారింది. ఈసారి వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇంత పెద్ద వర్షం ఇప్పటివరకు లేదు. దాదాపు గంట సేపు వర్షం దంచి కొట్టడంతో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. భీమారంలోని ఆరెపల్లి క్రాస్ రోడ్డు వద్ద వరద నీళ్లు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో జాతీయ రహదారిపై నిలిచిపోయాయి.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

పాతమంచిర్యాల: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్లలో బట్టలు ఆరవేయడానికి జీఐ వైర్లు ఉపయోగించొద్దని, ప్లాస్టిక్ దండెంలను ఉపయోగించాలని పేర్కొన్నారు. ఇనుప రేకులకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని, ఇళ్లలో ఎర్తింగ్ లేకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ పంపుసెట్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, సర్వీస్ వైరు తగలకుండా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పశువులను మేతకు తీసుకెళ్లేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు, ఏబీ స్విచ్ ఆపరేషన్, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకరమని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే లైన్‌మన్, లైన్‌ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్, సెక్షన్ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే కరెంటు బిల్లులో సంబంధిత ఏఈ ఫోన్ నంబరు ఉంటుందని, సంప్రదించి సేవలు పొందాలని తెలిపారు.

ఎమ్మెల్యేను అడ్డుకునే ప్రయత్నం



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

బెల్లంపల్లి: సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను అడ్డుకునేందుకు ఆశావర్కర్లు ప్రయత్నించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, పురప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆశా కార్యకర్తలు ఊరేగింపుగా వచ్చి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే బయటకు వస్తుండగా ప్రధాన గేట్ వద్ద అడ్డంగా నిలబడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు ఆశావర్కర్ల ప్రతినిధులను కార్యాలయం ఆవరణలోనికి పంపించి ఎమ్మెల్యేతో మాట్లాడించడానికి అనుమతించారు. ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు సమ్మక్క తదితరులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఆశా కార్యకర్తలు, సీఐటీయూ శ్రేణులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రహరీ క్లబ్



చెన్నూర్ మైనార్టీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సైలు

- డ్రగ్స్ నివారణకు చర్యలు
- మాదక ద్రవ్యాల కట్టడికి కమిటీలు
- విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ

మంచిర్యాలఅర్బన్: డ్రగ్స్ నివారణకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుకు నిర్ణయించింది. పాఠశాలల చుట్టుపక్కల ఎవరూ విక్రయించకుండా, విద్యార్థులు వినియోగించకుండా క్లబ్‌లు పటిష్ట చర్యలు చేపట్టనున్నాయి. డ్రగ్స్‌పై విద్యార్థుల్లో అవగాహన పెంచడంతోపాటు నిరంతర నిఘా పెంచనున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం జీవో నంబరు 20 జారీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి. దీంతో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటుకు సన్నద్ధం అవుతున్నారు.

పాఠశాల	సంఖ్య	విద్యార్థుల సంఖ్య (6నుంచి10వరకు)
ప్రభుత్వ, జిల్లా పరిషత్	108	14,893
మోడల్‌స్కూల్	05	1817
కేజీబీవీ	18	3335
యూఆర్ఎస్	01	42
సోషల్ వెల్ఫేర్ పాఠశాలలు	09	3358
ట్రైబల్‌వెల్ఫేర్	16	2060
బీసీ వెల్ఫేర్	08	2263
మైనార్టీ వెల్ఫేర్	03	474
కేంద్రియ విద్యాలయం	01	385
ఎయిడెడ్ స్కూల్	08	511
ప్రైవేట్ హైస్కూల్	104	26330
మొత్తం	281	55468

విద్యార్థులకు అవగాహన

మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థులు ఉంటే గుర్తించి వారిని అప్రమత్తం చేస్తారు. ప్రహరీ క్లబ్ ఏర్పాటు, డ్రగ్స్ వినియోగం వల్ల దుష్ప్రభావాలు వివరించి దూరమయ్యేలా జిల్లా కేంద్రంలో రెండు మూడు రోజుల్లో డీసీపీ నేతృత్వంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. అక్రమ రవాణాకు పిల్లలను వినియోగించినట్లయితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కట్టడి చేసి సంబంధిత పోలీసు అధికారులకు ప్రహరీ క్లబ్ సభ్యులు సమాచారం అందిస్తారు. డ్రగ్స్ వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తం చేయడంపై క్లబ్ దృష్టి సారించనుంది.

ఏర్పాటు ఇలా..

ప్రహరీ క్లబ్ అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ వ్యవహరిస్తారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు, చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, సభ్యులుగా 6వ తరగతి నుంచి 10వ తరగతులకు సంబంధించిన విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల్లో నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీసుస్టేషన్ నుంచి సిబ్బంది ఒకరు సభ్యులుగా ఉంటారు. కమిటీ కార్యకలాపాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను వినియోగించుకోవచ్చని డీఈవో యాదయ్య తెలిపారు.

విద్యార్థులు..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఆశ్రమ, రెసిడెన్షియల్ పాఠశాలలు మొత్తం 281 ఉన్నాయి. వీటిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 55,468 మంది విద్యార్థులు చదువుతున్నారు. 32 కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు 6,879 మంది ఉన్నారు.

అవగాహన సదస్సు

చెన్నూర్: స్థానిక మైనార్టీ కళాశాలలో గురువారం రామగుండం సీపీ ఆదేశాల మేరకు పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు శ్వేత, సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. డ్రగ్స్ పరీక్షల కోసం ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర యాంటీనార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) కిట్‌ను రూపొందించిందని తెలిపారు. ప్రధానంగా గంజాయి సేవించిన వారిని గుర్తించడం కోసం ఎబోస్ యూరిన్ కప్ యంత్రంతో అప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పాఠశాల తరగతి గదుల్లో ప్లకార్డులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్



దండేపల్లి: ద్వారకలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్

దండేపల్లి: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వర్చువల్‌గా ప్రారంభించగా, మండలంలోని ద్వారక రైతువేదికలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కలెక్టర్ కుమార్ దీపక్, రైతులతో కలిసి కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు పూర్తి రుణమాఫీ చేస్తామని అన్నారు. మాఫీ డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వస్తుందని, ఏవైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులను కలవాలని సూచించారు. అనంతరం రైతువేదిక ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు ఎమ్మెల్యే, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ తిరుపతి, డీఏవో సురేఖ, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి, ఏఎంసీ చైర్మన్ ప్రేంచంద్, ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, ఏవో అంజిత్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఆర్‌జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నాం

లక్సెట్టిపేట: రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో 2587మంది రైతులకు రుణమాఫీ అయిందని తెలిపారు. మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, నాగభూషణం, వ్యవసాయాధికారి ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఉసురుపోసుకున్న బీజేపీ, బీఆర్ఎస్

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



సీఎం సందేశాన్ని వీక్షిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

జైపూర్: గత బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు రైతుల ఉసురు పోసుకున్నాయని, పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక అనేకమంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి పాటుపడుతోందని, రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణమాఫీ చేశారని అన్నారు. గురువారం మండలంలోని టేకుమట్ల రైతువేదికలో రైతుల రుణమాఫీ కార్యక్రమంలో ఆయన రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసేవ కోసం కాకుండా కమీషన్ల కోసం ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా, రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. రైతులు సంతోషంగా రుణాలు పొంది వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో మార్క్‌గ్లాస్టన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంభర్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక బలోపేతమే ధ్యేయం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లిరూరల్: వ్యవసాయంలో రైతన్నకు అండగా నిలిచి ఆర్థికంగా బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం మండలంలోని కన్నాల రైతువేదికలో రైతు రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులు, నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడు నెలల పాలనలోనే పూర్తి స్థాయిలో అమలు చేశామని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలను అమలు చేసి ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.హరికృష్ణ, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో మహేందర్, మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్, ఏఈవో నాగదీప్తి, శ్రీనివాస్, చంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ స్వామి, ఏఎంసీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూరిబాబు, నాయకులు ఎం.మహేందర్, ఎస్.స్వామి, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సీఎం

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

జన్నారం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, రుణమాఫీ చేసి సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం జన్నారం మండల కేంద్రంలో రైతు రుణమాఫీ సంబరాలు, బస్టాండ్ నుంచి పొనకల్ రైతువేదిక వరకు నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మిగులు బడ్జెట్ ఉన్నా ఒకేసారి రుణమాఫీ చేయలేకపోయిందని తెలిపారు. లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో అప్పుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసినట్లు తెలిపారు. జన్నారం మండలానికి వంతెనలు, రోడ్లు, సైడ్ డ్రైనేజీల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏవో సంగీత, ఏఈవోలు అక్రముల్లా, త్రిసంధ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, శుభాష్‌రెడ్డి, శంకరయ్య, ఇషాక్, ఫసీఉల్లా, లక్ష్మీనారాయణ, మాణిక్యం, మాజీ ఎంపీటీసీ రియాజొద్దీన్, కాంగ్రెస్ నాయకులు ముజ్జు, రాకేశ్, గంగాధర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్‌ఇన్

బెల్లంపల్లి/చెన్నూర్/మందమర్రిరూరల్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలం. జిల్లాలోని మున్సిపాలిటీల్లో పారిశుధ్యం లోపించి, కాలువల్లో మురికి నీరు స్థిరంగా నిలిచి ఉండి, రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాలు, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయి. డెంగీ, మలేరియా వంటి జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో పట్టణాల్లోని ఆయా సమస్యలపై మున్సిపల్ కమిషనర్లతో 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. ఆయా పట్టణాల ప్రజలు నేరుగా కమిషనర్లతో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తోంది. మున్సిపాలిటీ ప్రజలు తమ ప్రాంత సమస్యలపై కమిషనర్లను ఫోన్‌లో సంప్రదించవచ్చు.

అంశం: పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

బెల్లంపల్లి



వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

సమయం : శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

98499 05887

మందమర్రి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

సమయం : శనివారం ఉదయం 9 నుంచి 10 వరకు

ఫోన్ నంబరు : 98499 71283

చెన్నూర్



గంగాధర్, మున్సిపల్ కమిషనర్, చెన్నూర్

సమయం : శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

91211 51760

రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతిరెడ్డి

- అర్హులకు రుణమాఫీ
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రుణమాఫీ పథకంలో జిల్లాలోని అర్హులైన రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. రైతు రుణమాఫీ పథకం అమలులో భాగంగా గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ అపర్ణరెడ్డి, లీడ్‌బ్యాంకు మేనేజర్ తిరుపతిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి బ్యాంకు నోడల్ అధికారులు, కంట్రోలర్లు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి కలిగి ఉండి రుణం పొందిన ప్రతీ రైతు కుటుంబానికి రుణమాఫీ వర్తిస్తుందని, స్వల్పకాలిక పంట రుణాలు పొందవచ్చని అన్నారు. వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల శాఖల నుంచి రుణాలు పొందిన రైతులకు పథకం వర్తిస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలుకు పోర్టల్ నిర్వహిస్తున్నామని, ప్రతీ బ్యాంకులో నోడల్ అధికారిని నియమించామని, రుణమాఫీ వివరాల నిర్ణీత నమూనాలు పొందుపర్చి డిజిటల్ సంతకం చేసి సమర్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో రైతుల వివరాలు పరిశీలించాలని, రూ.2లక్షలకు మించి రుణం ఉన్న రైతులు ఆపై నగదు చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ యోజన మినహాయింపులకు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్న వివరాల మేరకు ఆచరణాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆశావర్కర్ల హామీలు నెరవేర్చాలి

- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ
- ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నా



చెన్నూర్ ఎమ్మెల్యే ఇంటి వద్ద వినతిపత్రం

పాతమంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆశాకార్యకర్తలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, హైటెక్‌సిటీలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ ఇళ్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యేల పీఆర్‌వోలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ తాము 19ఏళ్లుగా కనీస వేతనానికి నోచుకోకుండా పనిభారంతో విధులు నిర్వర్తిస్తున్నామని, ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. రూ.18వేలు వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, పెరిగిన జీతాల ఏరియర్స్, పోలియో టీకా, లెప్రసీ సర్వే, ఎన్నికల విధులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని అన్నారు. ఆశాలకు ప్రభుత్వం నిర్వహించే పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాళ్లు పద్మ, విజయలక్ష్మి, సరోజ, రాణి, హైమావతి, మమత, గురులక్ష్మి, భారతి, ఉదయ, గీత, పద్మ, శారద, లలిత, సుజాత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపునకు కృషి



జెండా ఆవిష్కరిస్తున్న జనక్‌ప్రసాద్

జైపూర్: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదని, కార్మికుల వేతనాల పెంపుతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి కాంట్రాక్టు కార్మికులు పవర్ ప్లాంటు ప్రధాన గేటు వద్ద ఏర్పాటు చేసిన జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 40ఏళ్లుగా సింగరేణిలో కార్మిక పక్షపాతిగా పోరాటం చేపట్టి అనేక హక్కులు, సమస్యలు పరిష్కరించానని, ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్‌గా తనను నియమించిందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, వేతనాల పెంపు 100రోజుల్లో కొలిక్కి తీసుకు వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం రమేశ్, ప్లాంటు ఇంచార్జి గడ్డం రాకేశ్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణ, శ్రావణ్, రమేశ్, మనోజ్, మధుకర్, శివ, రామచందర్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాష్

మంచిర్యాలక్రైం: డ్రగ్స్ మత్తుకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో గురువారం యాంటీ నార్కోటిక్ అవేర్‌నెస్ డే సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకు యాంటీ నార్కోటిక్ అవేర్‌నెస్ డేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సరదాగా మొదలైన సిగరేటు, గుట్కా, ఆల్కాహాల్, గంజాయి, ఇతర రకాల డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. అలవాటు పడిన వారు ఉన్నట్లు దృష్టికి వస్తే 100 డయల్‌కు కాల్ చేయాలని తెలిపారు. గంజాయి ఎవరైన అమ్మినా, కొనుగోలు చేసినా సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ బన్సీనలాల్, ఎస్సైలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంలోని గోల్కొండ కాలనీకి చెందిన ఓ చిన్నారిపై గురువారం కోతులు దాడి చేసి గాయపర్చాయి. పెద్దల సంతోష్ కుమార్తె స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా కోతులు దాడి చేశాయి. చిన్నారి చేతికి గాయాలయ్యాయి. కోతుల బెడద నివారించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న పటిక

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో రామగిరి రైలులో గురువారం సోదాలు నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే పటికను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. రైలులో తరలిస్తున్న 300 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సోదాలలో రైల్వే జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేమనపల్లి: గుడుంబా విక్రేతలు ముగ్గురిని ఎక్సైజ్ సీఐ హరి ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రమేష్ ఎదుట బైండోవర్ చేశారు. మండల కేంద్రానికి చెందిన చల్ల మల్లేష్ నాలుగు క్వింటాళ్ల బెల్లం, పటిక, కేతన్‌పల్లికి చెందిన గురుండ్ల సంతోష్ గుడుంబా, నీల్వాయికి చెందిన కాటబోయిన చంద్రకళ గుడుంబాతో ఇటీవల పట్టుబడ్డారు. వీరు పద్ధతి మార్చుకోకపోవడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష విధించనున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోని ఆదిలాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంస్థతోపాటు అగ్రి ఇన్‌పుట్ స్టోర్‌లో పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఈవో సుమన్ తెలిపారు. ఇంటర్‌లో సీఈసీ, డిగ్రీలో బీకాం చేసి వారు అర్హులని పేర్కొన్నా రు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పక ఉండాలన్నారు. వివరాలకు 9963104247 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సరిహద్దున హై అలర్ట్

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్
- 12 మంది మావోయిస్టులు మృతి
- ఉమ్మడి జిల్లా సరిహద్దులో అప్రమత్తమైన పోలీసులు



ఎన్‌కౌంటర్ జరిగిన వందోళి అటవీ ప్రాంతం

చింతలమానెపల్లి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వందోళి అటవీ ప్రాంతంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో బుధవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో హైఅలర్ట్ పరిస్థితి నెలకొంది. జూలై 28 నుంచి ఆగస్టు 3వరకు మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో కోర్చి–తిప్పగడ్, చత్‌గావ్–కసన్‌సూర్ ఉమ్మడి దళ సభ్యులు సుమారు 12 నుంచి 15మంది గడ్చిరోలి జిల్లా వందోళి సరిహద్దులోని అటవీ ప్రాంతంలో విడిది చేసినట్లు తెలిసింది. సీ–60 కమాండో దళాలు, మవోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 12మంది మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఏడురుగురు పురుషులు కాగా, ఐదుగురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో జిల్లా సరిహద్దుపై పోలీసులు నిఘా పెంచారు.

సరిహద్దు మండలాల్లో నిఘా..

సరిహద్దున జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసులు అప్రమత్తం అయ్యారు. సరిహద్దు మండలాల్లో నిఘా పెంచారు. కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్, దహెగాం మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల్లో సరిహద్దు ప్రాంతాలైన అహేరి, ఏటపల్లి, భామ్రాగడ్‌కు చెందిన వారు ఉన్నారు. మహారాష్ట్ర వైపు కొంత ఆందోళనకర వాతావరణం ఉంది. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో గాయాలపాలైన, తప్పించుకున్న వారు తెలంగాణ వైపు వచ్చి ఉండవచ్చనే అనుమానాలను మహారాష్ట్ర పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా పోలీసులు సైతం ఈ దిశగా నిఘా పెంచారు. దళాల ఆధ్వర్యంలో కూంబింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసులకు సమాచారం అందించకుండా సరిహద్దు ప్రాంతాలకు ప్రజాప్రతినిధులు వెళ్లవద్దని పోలీసు అధికారులు హెచ్చరికలు చేశారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, అహేరి ఎమ్మెల్యే ఆత్రం ధర్మారావు బాబాతో గురువారం సమావేశం కావాల్సి ఉండగా.. పోలీసు అధికారుల సూచనతో రద్దయింది.

అప్రమత్తంగా ఉన్నాం

జిల్లా పోలీసులు మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉన్నారని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తెలిపారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నిఘా పెంచామని పేర్కొన్నారు. ఆయా మండలాల స్టేషన్లకు సూచనలు చేశామన్నారు. కూంబింగ్ యథావిధిగా నడుస్తోందన్నారు. ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



మొక్కలు నాటుతున్న డీడీఎంఎస్ వెంకన్న

- డీడీఎంఎస్ జీ.వెంకన్న
- శ్రీరాంపూర్ ఓసీపీ తనిఖీ

శ్రీరాంపూర్: గనుల్లో ఉద్యోగుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీడీఎంఎస్) బీ.వెంకన్న అన్నారు. ఆలిండియా మైన్స్ సేఫ్టీ అవార్డు కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయన గురువారం శ్రీరాంపూర్ ఓసీపీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్వారీ ఆవరణలో మొక్కలు నాటారు. గనిని సందర్శించి రక్షణ ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా నాలుగు గనులు ఆలిండియా మైన్స్ సేఫ్టీ అవార్డుకు ఎంపికయ్యాయని, ఇందులో శ్రీరాంపూర్ ఓసీపీ కూడా ఉండడం అభినందనీయమని అన్నారు. రక్షణతో పని చేసి బొగ్గు ఉత్పత్తి సాధించాలని, రక్షణ సూత్రాలను విస్మరించరాదని తెలిపారు. ఓసీపీలో ఇంజినీర్లు భారీ యంత్రాల్లో వినియోగించే ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రెషన్ సిస్టం పనితీరును ఆయనకు వివరించారు. గనిలో రక్షణ చర్యలను గని అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వెస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ జీఎం అనురాగ్‌శేఖర్ దూబే, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ జీఎం రవీంద్ర గత్వార్, యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా జీఎం మనోరంజన్ మహాలి, నైవేలీ జీఎం సురేశ్‌మూర్తి, డాక్టర్ రితేశ్, శ్రీరాంపూర్ ఇంచార్జీ జీఎం ఎం.శ్రీనివాస్, ఓసీపీ పీఓ టీ.శ్రీనివాస్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కే.వెంకటేశ్వర్‌రెడ్డి, అపెక్స్ కమిటీ సభ్యులు ఏవీ రెడ్డి, గని మేనేజర్ బ్రహ్మాజీ, రక్షణాధికారి శ్రీనివాస్, ఇంజినీర్ చంద్రశేఖర్, సంక్షేమ అధికారి బీ.శంకర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ నాయకుల అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్/కాసిపేట: బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లిన ఆ సంఘం నాయకులను హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేశారు. రాజ్‌భవన్‌కు చేరుకోకముందే అదుపులోకి తీసుకుని చిక్కడపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీరిలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, శ్రీరాంపూర్‌కు చెందిన యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, నాయకులు కొట్టె కిషన్‌రావు, మొతుక్కారి కొమురయ్య, అఫ్రోజ్‌ఖాన్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకటస్వామి, బ్రాంచి అసిస్టెంట్ సెక్రెటరీ తిరుపతిగౌడ్, నాగేశ్వర్‌రావు, కాసిపేట మైన్ ఫిట్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ, ఆఫీస్ బేరర్ రమేష్, బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ పుట్ట శ్రీనివాస్ ఉన్నారు. సీతారామయ్య మాట్లాడుతూ కేంద్రం తెలంగాణలోని బొగ్గు గనుల వేలం వేసి ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గనులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేయడానికి వెళ్లిన తమను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నాయకుల అరెస్ట్‌ను ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ ఖండించారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారావు

భీమిని: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అవకతవకలు సామాజిక తనిఖీ ప్రజావేదిక ద్వారా వెల్లడయ్యాయి. గురువారం కన్నెపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధిహామీ పథకం కింద రూ.1,66,28,044 విలువైన పనులు 15 గ్రామ పంచాయతీల్లో చేశారు. ఆయా పనుల్లో జరిగిన అవినీతిపై పంచాయతీల్లో రికవరీ చేశారు. మాడవెల్లిలో రూ.11,159, నాయకునిపేటలో రూ.1346, లింగాలలో రూ.5,486, మెట్‌పల్లిలో రూ.367, వీరాపూర్‌లో రూ.271, కన్నెపల్లిలో రూ.242, రెబ్బెనలో రూ.265, జజ్జరవెల్లిలో రూ.1000 జరిమానా విధించారు. మొత్తం రూ.19,364 రికవరీ, రూ.వెయ్యి జరిమానా వేశారు. సామాజిక తనిఖీ బృందాలు సరిగా తనిఖీలు చేపట్టలేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ సమావేశానికి ప్రజలు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం. ఈ సమావేశంలో ప్రిసైడింగ్ అధికారి, అడిషనల్ డీఆర్‌డీఓ దత్తారావు, డీవీఓ కిరణ్, ఎంపీడీఓ గంగామోహన్, అంబుడ్స్‌మెన్ శివరాం, ఏపీఓ శ్రీనివాస్, ఎస్ఆర్‌పీ రాఘవులు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో రక్షణే ప్రథమం



అధికారులకు సూచనలు ఇస్తున్న జీఎం

మందమర్రిరూరల్: ప్రతీ ఉద్యోగికి విధి నిర్వహణలో రక్షణే ప్రథమమని ఏరియా జీఎం మనోహర్ అధికారులకు సూచించారు. గురువారం ఏరియాలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రమాదాల నివారణ, వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని, ఉద్యోగులకు ఎప్పటికప్పుడు రక్షణ సూత్రాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, ఏరియా డీజీఎంలు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్, ఏజెంట్లు, మేనేజర్లు, ఫిట్ ఇంజనీర్స్, సేఫ్టీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మహారాష్ట్రకు తరలిస్తున్న ఎరువుల పట్టివేత



తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నూర్: చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా నాలుగు వాహనాల్లో తరలిస్తున్న డీఏపీ 2020 యూరియా బస్తాలను సీఐ రవీందర్ పట్టుకున్నారు. గత కొంతకాలంగా చెన్నూర్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా ఎరువులు రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు గురువారం చెన్నూర్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు వాహనాలను తనిఖీ చేయగా 200 యూరియా బస్తాలు లభించాయి. ఎలాంటి ఆన్‌లైన్ బిల్లులు లేవు. తెల్లకాగితాలపై బస్తాల వివరాలు రాసి ఉన్నాయి. దీంతో వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ కేసును వ్యవసాయాధికారి శ్రీనివాస్‌కు అప్పగించామని సీఐ తెలిపారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ



గాయపడిన అల్లూరి అనిల్, శంకర్

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలంలోని మత్రిపల్లి స్టేజీ సమీపంలో గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏనగూడ గ్రామానికి చెందిన ఎంగిలి రమేశ్, పోశాలు బైక్‌పై దహెగాం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గిరవెల్లి గ్రామానికి చెందిన అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ దహెగాం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. మత్రిపల్లి స్టేజీ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఎంగిలి రమేశ్, అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ తీవ్రంగా గాయపడగా.. పోశాలుకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం రమేశ్‌ను ప్రైవేట్ వాహనంలో మంచిర్యాలకు, అనిల్, శంకర్‌ను అంబులెన్సులో బెల్లంపల్లికి తరలించారు. ఏఎస్సై ఉత్తం ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

శ్రేష్ఠ పథకానికి నలుగురు ఎంపిక

రామకృష్ణాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ఠ పథకానికి పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తద్వార సామాజిక అభివృద్ధికి బాటలు వేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల శ్రేష్ఠ పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థినులు సింధు, భవాని, వనజ, మానసలకు ఉచిత రెసిడెన్షియల్ విద్యతోపాటు వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. విద్యార్థినులను కళాశాల సిబ్బంది అభినందించారు.

ఎస్ఎఫ్ఐకి రాజీనామా

మంచిర్యాలఅర్బన్: వ్యక్తిగత కారణాల వల్ల ఎస్ఎఫ్ఐ బాధ్యతలకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు జిల్లా సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి తెలిపారు. రాజీనామా లేఖ పంపించినా విద్యార్థి సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేయటం సరికాదని తెలిపారు.

గిరిజనులను బెదిరించే చర్యలు మానుకోవాలి

బెల్లంపల్లి: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులను బెదిరిస్తూ అక్రమ కేసులు పెట్టే చర్యలను ప్రభుత్వ అధికారులు వెంటనే మానుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎమ్మెల్యే వినోద్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిని మండలం ఖర్జీ భీంపూర్ గ్రామ శివారు సర్వే నంబరు 312లో పోడు భూములను ఆదివాసీ మన్నెవార్ గిరిజనులు ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి పట్టాలు ఇవ్వకుండా అధికారులు వేధింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లో..!



బెల్లంపల్లి మండలం లంబాడితండాలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో అరకొర వసతులు
- దశాబ్దాలు గడుస్తున్నా పక్కా భవనాల ఊసే కరువు
- బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో అద్దె భవనాల్లో 121 కేంద్రాలు
- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీల సిబ్బంది, గర్భిణులు, చిన్నారులు

బెల్లంపల్లిరూరల్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయడంతో పాటు, గర్భిణులకు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పౌష్టికాహారం పంపిణీలో తరచూ జాప్యం ఏర్పడుతుండడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగించడం లబ్ధిదారులకు మరింత ఇబ్బందికరంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా పక్కా భవనాలు లేకపోవడంతో అరకొర వసతులతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు.

బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో...

బెల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 279అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. బెల్లంపల్లి అర్బన్, బెల్లంపల్లిరూరల్, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లో కలిపి మొత్తం కేవలం 73పక్కా భవనాలు మాత్రమే ఉండగా మరో 85అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానం చేశారు. 121అంగన్‌వాడీ కేంద్రాలు నేటికీ అద్దె భవనాల్లోనే అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

పక్కా భవనాలు కరువు...

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కోసం పక్కా భవనాల ఏర్పాటు పై అధికారయంత్రాంగం ఇంకా నిర్లక్ష్య ధోరణిని వీడనట్లు కనిపిస్తోంది. ఐసీడీఎస్ వ్యవస్థ ప్రారంభమై దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఒక ప్రాజెక్టు పరిధిలో 121అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నూతన భవనాల కోసం అధికారులు చేస్తున్న ప్రతిపాదనలు బుట్ట దాఖలవుతుండడంతో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక అంగన్‌వాడీ టీచర్లు ఒకే గదిలో సరుకులు నిల్వ ఉంచడం, వంట చేయడం, గర్భిణులకు, చిన్నారులకు సేవలు అందించడం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అది కాక భవనాల యజమానులు ఎప్పుడు ఖాళీ చేయమంటారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల అద్దె ఎక్కువ ఇస్తామన్నా కూడా గదులు దొరికే పరిస్థితులు లేవు. దీనికి తోడు అద్దె భారం కూడా అధికంగానే ఉంది. 121భవనాలకు సరాసరిన ప్రతి నెలా రూ.3లక్షలకు పైగానే అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఇది ఒక్కింత భారమైనప్పటికీ పక్కా భవనాలు లేక ఇది తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం స్పందించి పక్కా భవనాల ఏర్పాటు పై దృష్టి సారిస్తేనే మెరుగైన అంగన్‌వాడీ సేవలు అందే అవకాశం ఉంది.

అరకొర వసతుల మధ్య..

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తుండడంతో ఆ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా వరకు ఒకే గదిలో ఈ కేంద్రాలు నిర్వహిస్తుండడంతో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన అనుకున్న మేర సాగడం లేదు. గర్భిణులు, బాలింతలు కూడా అందీఅందని సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం, నీటి వసతి, ఆటస్థలం, వంటగది లాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇటు లబ్ధిదారులకు అటు అంగన్‌వాడీ టీచర్లు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పక్కా భవనాల కోసం ప్రతిపాదించాం



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల కోసం గతంలోనే ప్రతిపాదించాం. కానీ అవి ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. అద్దె భవనాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలను అందిస్తున్నాం. పక్కా భవనాల మంజూరు కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. –మాను ఉమాదేవి, సీడీపీవో, ఐసీడీఎస్ బెల్లంపల్లి ప్రాజెక్టు

నిందితులను అరెస్టు చేయాలి

బెల్లంపల్లి: తమపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చిన నిందితులను అరెస్టు చేయించాలని బెల్లంపల్లికి చెందిన దళిత మహిళ, బాధితురాలు ఎర్ల లావణ్య కోరారు. గురువారం హైదరాబాద్‌లో దళిత బహుజన ఫ్రంట్ (బీడీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పనతో కలిసి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొనకాటి లక్ష్మీనారాయణను స్వయంగా కలిసి వినతిపత్రం అందించగా, మరో సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్‌కు ఫోన్ చేసి దాడి విషయాన్ని బాధితురాలు విన్నవించారు. బెల్లంపల్లిలో తమ ఇంటి స్థలం కబ్జా చేయడానికి సంతోష్ ఆయన తల్లిదండ్రులు మల్లేశ్వరి, రాజయ్య దూషించి దాడి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ హైదరాబాద్ నగర నాయకుడు భ్యాగరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి..



బురదరోడ్డుపై కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం నర్సాపూర్ ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది బురద రోడ్డులో రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి రాజులగూడ గ్రామస్తులకు వైద్యం అందించారు. వివరాలు.. సిరిచెల్మ ఆరోగ్య ఉపకేంద్రం హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఎంఎల్‌హెచ్‌వో సంగీత, ఆశ కార్యకర్తలు గంగామణి, లక్ష్మి నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని రాజులగూడలో గురువారం వైద్యశిబిరం నిర్వహించాల్సి ఉంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు బురదమయమైంది. అయినా సిబ్బంది ఎంతో శ్రమకోర్చి రెండు కిలోమీటర్ల కాలినడకన గ్రామానికి చేరుకున్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి 12 మంది రక్త నమూనాలు సేకరించారు. గర్భిణులు, బాలింతలకు రోగ నిరోధక టీకాలు వేశారు. మరో 95మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

'ఎల్లంపల్లి'కి చేరని వరద

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి జలాశయం 5 టీఎంసీల నీటి సామర్థ్యంతోనే ఉంది. ఓ వైపు మోస్తారుగా వర్షాలు కురుస్తున్నా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి ప్రవాహం అంతగా లేకపోవడంతో ప్రాజెక్ట్‌లోకి నీరు చేరడం లేదు. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్ట్ క్రస్ట్ లెవెల్ 146 మీటర్లు ఉండగా 15 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇక గురువారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 140.25 మీటర్లు ఉంది. మొత్తం 20.175 టీఎంసీలకు గాను 5.200 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో కింద ఎగువ ప్రాంతాల నుంచి 2,479 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 331 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.